సాక్షి
తిరుపతి
ఆదివారం । 5 । మార్చి । 2023


తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.57,890
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,171
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.66,300
రిటైల్ వెండి గ్రాము రూ.68.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	19
తిరుమల	31	14
చిత్తూరు	35	17
గూడూరు	35	20
నగరి	36	18



జిల్లాలో విస్తృత తనిఖీలు

తిరుపతి అలిపిరి : ఎర్రచందనం అక్రమ రవాణాపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకులు


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం రాత్రి శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో మర్రిమంద గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఓసూరు కిష్టప్ప మొదలియార్ అలియాస్ వరదయ్యతో పాటు మరో 30 మంది కార్యకర్తలు ఉన్నారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు సుధీర్‌కుమార్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు చంద్రశేఖర్ అలియాస్ ఎస్‌ఎస్‌చంద్ర, నాయకులు మణి, జయప్రకాష్, మోహనకృష్ణ, సురకాని లింగయ్య, హేమాద్రి, శివ, సురేష్, వెంకటమునిి, రాజీవ్, వంశీకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి


సీతారామిరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లాలోని వాహనదారులు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి వాహనదారుడూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు వాడాలన్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసే వారికి వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు కూడా షోరూం నిర్వాహకులే అందజేస్తారని తెలిపారు. అయితే పాత వాహనాలు కలిగిన వారు రవాణాశాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి హైసెక్యూరిటీ నంబర్ ప్లేటు కోసం బుక్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

రేణిగుంట: గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కోసం 25 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ తెలిపారు. భారతీయ వ్యవసాయ నైపుణ్య శిక్షణ మండలి న్యూఢిల్లీ సహకారంతో రాస్ కేవీకే ఆధ్వర్యంలో 18–40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతకు సేంద్రియ పద్ధతిలో వర్టికల్, అర్బన్, రూఫ్, టెర్రాస్ గార్డెనింగ్, కూరగాయల సాగుపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని వారు మార్చి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి తాము అందించే సర్టిఫికేట్ ఆధారంగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9908836684లో సంప్రదించాలని కోరారు.

స్విమ్స్‌లో నిరంతర వైద్యవిద్య కార్యక్రమం

తిరుపతి తుడా : స్విమ్స్ ట్రాన్స్‌ఫ్యూషన్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీపద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్యవిద్య కార్యక్రమాన్ని (హైబ్రిడ్ మోడ్ పద్ధతిలో) విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ రెసిడెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్, స్విమ్స్ డాక్టర్ జీ.రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు డాక్టర్ యశోవర్ధన్, సీనియర్ రెసిడెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్,"స్విమ్స్ డాక్టర్ నాగసౌమ్య, సీనియర్ రెసిడెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ డాక్టర్ జి.సంధ్యా, స్విమ్స్ డాక్టర్ బి.సురేష్ బాబు పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.





వెన్నెల్లో వెండి కృష్ణుడు

తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం రాత్రి రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి అలంకరణలో మలయప్ప స్వామి భక్తులను అనుగ్రహించారు. పుష్కరిణిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పలపై విహరిస్తూ కనువిందు చేశారు. - తిరుమల

ఓట్ల లెక్కింపుపై అవగాహన


కౌంటింగ్ పర్సనల్స్‌కు అవగాహన కల్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ పర్సనల్స్‌కు శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. జేసీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమావళిని క్షుణ్ణంగా చదివి నిష్పక్షపాతంగా కౌంటింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీన మరో పర్యాయం ఆర్‌వీఎస్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధులు నిర్వహించనున్న సిబ్బంది తప్పనిసరిగా మాన్యువల్‌పై అవగాహన పెంపొందించుకోవలని సూచించారు. విశ్రాంత జేసీ చంద్రమౌళి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో పర్సనల్స్‌కు నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో తిరుపతి డీఆర్‌ఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డీఓలు రేణుక, సుజన, శివయ్య, మురళి, చంద్రమునిరాజార్, రామారావు, కిరణ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నాన్న ఎక్కడ చినబాబూ..?

- మంత్రి పెద్దిరెడ్డిపై కావాలనే విమర్శలు
- లోకేష్ తీరుపై ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పుంగనూరు : నారా లోకేష్‌కు దమ్ముంటే తన చిన్నాన్న రామ్మూర్తినాయుడు ఎక్కడ ఉన్నాడో తెలియజేయాలని, రహస్యంగా ఎందుకు దాచారో వెల్లడించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రశ్నించారు. శనివారం పుంగనూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కుప్పం అభివృద్ధి పేరుతో చంద్రబాబు రూ.వేల కోట్లు ఆర్జించిన విషయం లోకేష్‌కు కూడా తెలుసన్నారు. యువగళం పాదయాత్రకు జనం రాకపోవడంతో కర్ణాటక నుంచి పెయిడ్ ఆర్టిస్టులను పిలిపించుకున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో పుంగనూరు అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేశామని లోకేష్ చెప్పడంపై మండిపడ్డారు. పెద్దిరెడ్డిపై కక్షతో పుంగనూరు నియోజకవర్గాన్నే పట్టించుకోలేదని ఆరోపించారు. కుప్పం నుంచి తిరుపతి వెళుతూ మార్గ మధ్యలో అక్కడక్కడా శిలాఫలకాలు మాత్రం వేశారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో కమీషన్ ఏజెంట్లు, బ్రోకర్లు రాజ్యమేలారని, ఇజ్రాయెల్ ప్రాజెక్టు పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేశారని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, కళాశాలలను బంధువులకు కేటాయించి పేదలను దోచుకున్నారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిపక్షనేత నియోజకవర్గమైనా కుప్పంలో భారీగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నీతి నిజాయితీతో పెద్దిరెడ్డి కుటుంబం ప్రజలకు సేవలందిస్తోందని తెలిపారు. అసత్య ఆరోపణలు చేస్తే రాబోయే ఎన్నికల్లో పేదలే తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన

చిత్తూరు రూరల్ : నగరంలోని సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని వివరించారు. సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి, నోడల్ ఆఫీసర్ నిర్మలదేవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాలకు చిరునామా!



'చిట్టిధాన్యం-గట్టి ఆరోగ్యం, సంపూర్ణ ఆరోగ్యం-చిరుధాన్యాలతో సాధ్యం, చిరుధాన్యాల్లో పోషకాలు మెండు, ఒక పూట చిరుధాన్యం-జీవిత ఆయుష్షుకు ఆధారం, చిరుధాన్యాలు-పోషకాల ఘని' ఇదీ జిల్లాలో ఏ పల్లెలో చూసినా మార్మోగుతున్న ప్రచారం. కోవిడ్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆ మేరకు గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరిస్తూ ప్రజలను మరింత ఉత్సాహపరుస్తోంది. మార్కెట్‌కు ఢోకాలేదని రైతులకు భరోసా కల్పిస్తోంది. వచ్చే ఖరీఫ్ నాటికి జిల్లాలో పది వేల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది.

- జిల్లాలో పుంజుకుంటున్న చిరుధాన్యాల సాగు
- వ్యవసాయశాఖ నేతృత్వంలో అవగాహన సదస్సులు
- ఖరీఫ్ నాటికి 10 వేల ఎకరాల్లో సాగే లక్ష్యం
- చౌకదుకాణాల్లోనూ పంపిణీకి సర్వం సిద్ధం
- 2023ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన ఐక్యరాజ్య సమితి

తిరుపతి అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల సాగుకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పటికే రాగులు, జొన్నలు, సజ్జలు 3వేల ఎకరాలకు పైగా రైతులు సాగుచేస్తుండగా వచ్చే ఖరీఫ్‌నాటికి దీన్ని 10 వేల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటితోపాటు కొర్రలు, అండుకొర్రలు, సామలు, అరికలు, ఊదలు, వరిగేలు సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులను ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో తెలియజేస్తున్నారు. పల్లెల్లో గ్రామసభల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

తొలి దశలో పది మండలాలు

తొలి దశలో జిల్లాలో పది మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పిచ్చాటూరు, కేవీబీపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, తడ, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, వడమాలపేట మండలాల్లో అవగాహన సదస్సులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రెండో దశలో ఫిబ్రవరి రెండో వారం నుంచి మరో పది మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.


చిరుధాన్యాలపై పిచ్చాటూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

ఫిబ్రవరి చివరికల్లా జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లోనూ చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ.. రైతులను మరింత ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు.

పెట్టుబటి తక్కువ..పోషకాలు ఎక్కువ

వరి, చెరుకు, అరటి తదితర పంటలు సాగుచేయడానికి అధిక పెట్టుబడితోపాటు నీటి తడుల సంఖ్య ఎక్కువ. చిరుధాన్యాలను వర్షాధారంగానూ పండించొచ్చు. మెట్ట ప్రాంత రైతులకు చిరుధాన్యాల సాగు ఓ వరమనే చెప్పాలి.

ఆరోగ్యానికి చిరునామా!

జీర్ణశక్తికి సంబంధించి వరి, గోధుమలతో పోల్చుకుంటే చిరుధాన్యాల్లో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఎముకల పటిష్టతకు, రక్తవృద్ధికి, పిల్లల ఎదుగుదలకు, గర్భిణి, బాలింతలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి.


2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన అంశాన్ని తెలియజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

చిరుధాన్యాల్లో ఏమేముంటాయంటే (ప్రతి 100 గ్రాములకు)

పిండిపదార్థాలు	:	66.95 గ్రాములు
మాంసకృతులు	:	9.05 గ్రాములు
శక్తి	:	326.17 కేలరీలు
థైమిన్(బీ1)	:	6.మి.గ్రా
రిబోఫ్లేవిన్ (బీ2)	:	0.14 మి.గ్రా

చౌకదుకాణాల్లో విక్రయాలు!

చౌకదుకాణాల్లో బియ్యం, చక్కెర, కంది పప్పుతోపాటు అటవీ ఉత్పత్తులను రేషన్ డీలర్లు విక్రయించడానికి రెండు నెలల క్రితమే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఏప్రిల్ నుంచి చిరుధాన్యాలను కూడా విక్రయించే దిశగా అడుగులు వేస్తోంది. తొలి విడతలో రాగులు, జొన్నలు ఇవ్వాలని భావిస్తోంది. రెండో విడతలో కొర్రలు, అండుకొర్రలు, సామలు, అరికెలు తదితర పది రకాలు పంపిణీ చేయాలని భావిస్తోంది.

మరింత ప్రోత్సాహం



సాధారణ పంటలతోపాటు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నాం. చిరుధాన్యాల ఉపయోగాలు, పోషకాలపై పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పంటకు కూడా మంచి డిమాండ్ ఉంటుందని రైతులకు తెలియజేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వచ్చే సీజన్ నుంచి అధికంగా సాగులోకి తీసుకువస్తాం.
–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పది రకాల పంపిణీకి సన్నద్ధం



చౌకదుకాణాల్లో అన్ని వస్తువులను కార్డుదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బియ్యం, చక్కెర, కంది పప్పులకే పరిమితం కాకుండా చిరుధాన్యాలను సైతం అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. తాజాగా జొన్నలు, రాగులతోపాటు మరో పది రకాల చిరుధాన్యాలను పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఈ మూడేళ్లలో కొత్తగా జిల్లాలో 1,63,451 కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు.
–ఎంవీ ప్రసాద్, సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి

చిరుధాన్యాలంటే చిన్నచూపొద్దు



చిరుధాన్యాలు అంటే చాలమంది చిన్నచూపు చూస్తున్నారు. అయితే ఆరోగ్యానికి, శరీరానికి అవి చేసే మేలు తెలుసుకుంటే ఆశ్చర్యమేస్తుంది. రోజు వారీ ఆహారంలో చిరుధాన్యాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేసుకోవాలి. ఆరోగ్య సమస్యల నివారణకు దివ్యఔషధంగా పనిచేస్తాయి. పిండి పదార్థాలు, మాంసకృతులు ఎక్కువ. కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. అధిక బరువు తగ్గడానికి, ఆకలి తగ్గించడానికి దోహదపడుతాయి.
– డాక్టర్ ఎం.మంజువాణి, పోషకాహార నిపుణురాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత


మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి కేంద్రంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు కావాల్సిన బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా 8 ప్రాంతాల్లో 51 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల్లో అదనపు బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి పోలింగ్ రోజున ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రొసీడింగ్ అధికారికి తెలియజేయాలన్నారు. ట్రబుల్ మంగర్స్, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి బైండోవర్ చేసుకోవాలని ఆదేశించారు. 23 రెవెన్యూ రూట్‌లలో ప్రత్యేక పోలీస్ బలగాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాల వరకు ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని చెప్పారు. 37 పోలీస్ రూట్ మొబైల్‌ను నియమించి, అందులో ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా 10 చెక్ పోస్ట్‌లు, 7 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 24 స్ట్రైకింగ్ ఫోర్ టీమ్లు నిరంతరం నిఘా ఉంచేలా చూసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే స్థానికులు కూడా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి

అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఆర్వో అధికారి ఉత్తర్వులు పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమల్లో ఉంచాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. సభలు, సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరని చెప్పారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఘనంగా ప్రారంభమైన జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల గేమ్స్‌మీట్



బాస్కెట్ బాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణయ్య, జోజిరెడ్డి

గూడూరురూరల్: క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చిని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ పీవీ.కృష్ణయ్య తెలిపారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జేఎన్‌టీయూ అనంతపూర్ 11వ అంతర్ కళాశాలల గేమ్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి బీ.జోజిరెడ్డి ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ జెండా, యూనివర్సిటీ జెండాలను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ గేమ్స్ మీట్‌లో జేఎన్‌టీయూ పరిధిలోని 6 జిల్లాల నుంచి 48 కళాశాలలకు చెందిన సుమారు 1,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి పీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం ఉన్న మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందాలంటే క్రీడా కార్యక్రమాలను ఆయా కళాశాలలు తప్పని సరిగా ప్రోత్సహించాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లతోనే ఎక్కువగా గడుపుతున్నందువల్ల శారీరక శ్రమ ఉండడం లేదన్నారు. విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత పెంపొందించుకోవచ్చని చెప్పారు. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి బీ.జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్, ప్రిన్సిపల్ ధనుంజయ, వేణుమాధవ్, ఏ.ఓ రామయ్య, నాగేశ్వరరావు, పీడీ రవిచంద్ర పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో కొత్తగా నిర్మాణం చేస్తున్న ఓ భవంతి వద్ద ఉన్న సుమారు రూ.4 లక్షలకు పైగా విలువ చేసే సెంట్రింగ్ సామగ్రి చోరీకి గురైనట్లు బాధితుడు చెంచయ్య మేస్త్రీ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రింగ్ పనులకు వాడే 350 షీట్లు, పిల్లర్లకు వేసే 10 బాక్సులను గుర్తుతెలియని వక్తులు అర్ధరాత్రి సమయంలో ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మెగా జాబ్ మేళాలో 366 మందికి ఉద్యోగాలు



విద్యార్థులతో సిద్దార్థ ఇంజినీరింగ్ అండ్ ఎంబీఏ కళాశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజినీరింగ్ అండ్ ఎంబీఏ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 366 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. మ్యాజిక్ బస్ ట్రిజెన్ టెక్ ఐటీ సొల్యూషన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి చెందిన 13 ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు పాల్గొన్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాకు చెందిన వివిధ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలల నుంచి సుమారు 700 నుంచి 800 మంది గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు. హాజరైన ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు విద్యార్థులను వివిధ రకాలుగా పరీక్షించి 366 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిలో 248 మంది గొల్లపల్లి సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా ఆ కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, కార్యదర్శి వై.ఆనంద్ మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యధిక మంది తమ కళాశాల నుంచి ఉద్యోగాలకు ఎంపికకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ అర్హత సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు. ఉద్యోగ అర్హత సాధించిన వారికి 3.2 ఎల్‌పీఏ నుంచి 5.34 ఎల్‌పీఏ వరకు వార్షిక వేతనం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ పీ.స్వామినాథ్, ఆఫీసర్ ఎస్.భాస్కర్, వివిధ విభాగాధిపతులు సాయిప్రసాద్, ఆనంద్, బాలసుబ్రమణ్యం, అబ్రార్, భయ్యారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో మెరిసిన తిరుపతి డీఏఓ

- ఉత్తమ అధికారిగా ఎంపిక
- పలువురు అధికారుల హర్షం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ఉత్తమ వ్యవసాయ అధికారిగా తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అగ్రికల్చర్ ఆఫ్ కమిషనర్ హరికిరణ్ శనివారం ప్రకటించారు. వ్యవసాయశాఖలో ప్రతినెలా ఉత్తమ అధికారులను రైతు భరోసా పుస్తకంలో ప్రచురిస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా ఫిబ్రవరి నెలకు సంబంధించి రాష్ట్ర ఉత్తమ అధికారిగా తిరుపతి జిల్లాకు చెందిన ఎస్.ప్రసాద్‌రావు ఎంపికయ్యారు. ప్రధానంగా డీఏఓ నేతృత్వంలో పంట ఈ క్రాప్, స్పందన, జగనన్నకు చెబుదాం, ఆర్‌బీకేల ద్వారా సీడ్స్ పంపిణీ, ఫర్టిలైజర్స్, కార్యాలయ రికార్డ్స్ క్రమబద్ధీకరణ, బడ్జెట్ వ్యవహారాలు తదితర 20 అంశాల్లో 100 శాతం పూర్తిచేశారు. అలాగే పీఎం కిసాన్ 98శాతం పూర్తిచేయించారు. ఆయన శ్రమను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధికారిగా ఎంపికచేసింది.

పలువురు అధికారులు కూడా..

జిల్లాలోని 8 మంది ఏడీఏలకు జిల్లా ఉత్తమ అధికారులుగా గుర్తింపు లభించింది. అలాగే 52 మంది ఏఓలకు గాను 33 మంది ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు.

ఇదే స్ఫూర్తితో పనిచేస్తా



ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం. జనవరిలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ఉత్తమ వ్యవసాయాధికారిగా గుర్తింపు వచ్చింది. ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం దక్కింది. సమష్టిగా మా విభాగాన్ని ముందుకు నడిపిస్తా. నాతోపాటు పలువురు ఏడీఏలు, ఏఓలకు ఉత్తమ అధికారులుగా గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. - ఎస్.ప్రసాద్‌రావు, డీఏఓ

పది పరీక్షలకు పటిష్ట చర్యలు



పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలు పరిశీలిస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు, డీఈఓ శేఖర్

తిరుపతి అర్బన్: పదోతరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డీఆర్వో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలో మొత్తం 152 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో 28,412 అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో మొదటిసారిగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పదో తరగతి ప్రశ్నపత్రాలను ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల, బాలాజీ నగర్ కాలనీ తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచనున్నట్టు వెల్లడించారు. అదే క్యాంపస్‌లో స్పాట్ వ్యాల్యుయేషన్ ఉంటుందన్నారు. పదోతరగతి హాల్‌టికెట్ కలిగిన విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ఇలా..

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పబ్లిక్ ఎగ్జామ్స్‌కు కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. పదోతరగతి 7 సెంటర్లలో, ఇంటర్మీడియెట్ 11 సెంటర్లలో నిర్వహిస్తామన్నారు. డీఈఓ వీ.శేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆనంద రెడ్డి, తిరుపతి అదనపు మునిసిపల్ కమిషనర్ సునీత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఖజానాశాఖ అధికారి ప్రసాద్, ఏపీ ఎస్పీడీసీఎల్ డీఈ శ్రీనివాసులు, పోలీస్‌శాఖ, ప్రజారవాణాశాఖ అధికారులు డీఆర్ నాయుడు, జిల్లా ఇంటర్మీడియెట్ కార్యాలయం నుంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.